## క్లుప్తంగా

### ఎఫ్‌ఏ-1 పరీక్షలు ప్రారంభం



పరీక్షలను పర్యవేక్షిస్తున్న ఎంఈఓ-1సామల

బలిజిపేట: పాఠశాలల్లో ఎఫ్‌ఏ-1పరీక్షలు సోమవారం ప్రారంభమయ్యాయి. అన్ని పాఠశాలలకు సంబంధిత ప్రశ్నపత్రాలు క్లస్టర్ నుంచి తీసుకువెళ్లారు. తేదీల వారీగా, సబ్జెక్టుల వారీగా సమయపాలనతో పరీక్షలను నిర్వహించాలని ఎంఈఓ-1సామల సింహాచలం తెలిపారు. అందులో భాగంగా బలిజిపేట ఉన్నత పాఠశాలలో పరీక్షలు రాస్తున్న విద్యార్థులను ఆయన పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు వి.వెంకటినాయుడు, సహ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

### వృథాగా పోతున్న తాగునీరు



బలిజిపేటలో ఉన్నత పాఠశాల సమీపంలో పోతున్న నీరు

బలిజిపేట: గ్రామాల్లో రక్షిత మంచినీటి పథకాల వీధి కొళాయి పాయింట్లకు కంట్రోల్ లేక పోవడంతో నీరు వృథాగా పోతోందని ప్రజలు చెబుతున్నారు. రక్షిత మంచినీరు వృథాగా పోవడం ఎంతో బాధాకరంగా వాపోతున్నారు. కొన్ని రోజులు పూర్తిగా తాగునీటి సరఫరాకు అంతరాయం కలగడం, మరికొన్ని రోజులు వచ్చిన నీరు వృథాగా పోవడం నిర్వహణ లోపాలతో ఉంటోందని, మండలంలోని ప్రతి గ్రామంలో ఇవే పరిస్థితులు ఎదురవుతున్నాయని వాటిని నియంత్రించాలని ప్రజలు కోరుతున్నారు.

### హెల్మెట్ వినియోగం తప్పనిసరి



వాహనచోదకులకు హెల్మెట్ వినియోగంపై అవగాహన కల్పిస్తున్న ఎస్సై వెంకటరమణ

మక్కువ: వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ వినియోగించాలని, లేని పక్షంలో జరిమానా తప్పదని ఎస్సై వెంకటరమణ చెప్పారు. ఈ మేరకు స్థానిక శ్రీదేవి థియేటర్ సమీపంలో సోమవారం వాహనతనిఖీలు చేపట్టారు. వాహనదారులను నిలుపుదలచేసి, వాహన పత్రాలు పరిశీలించారు. అలాగే హెల్మెట్ వినియోగించని వాహనదారులకు అపరాధ రుసుము విధించారు. అనంతరం వాహనదారులకు అవగాహన కల్పించారు. మద్యం తాగి వాహనాలు నడిపితే రూ.10వేలు జరిమానా విధించనున్నట్లు తెలిపారు. హెల్మెట్ వినియోగం వల్ల ప్రమాదాల నుంచి బయటపడవచ్చునన్నారు.

### చినుకుపడితే మెయిన్ రోడ్డు జలమయం




సెల్‌ఫోన్‌లో ఫొటోలు జాయింట్ కలెక్టర్‌కు చూపిస్తున్న కాంగ్రెస్ నాయకులు

పార్వతీపురం రూరల్: చినుకుపడితే జిల్లా కేంద్రంలోని ప్రధాన రహదారి జలమయమై చెరువును తలపిస్తోందని రహదారిపైకి వర్షపునీరు రాకుండా పనులు చేపట్టాలని కాంగ్రెస్‌పార్టీ నాయకులు సోమవారం కలెక్టర్ కార్యాలయంలో పీజీఆర్‌ఎస్‌లో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభికకు వినతిపత్రం అందజేశారు. ఈ మేరకు పట్టణంలో ఎక్కడెక్కడ ఆ పరిస్థితి ఉందో, ఇటీవల వరదకు గురైన ప్రాంతాల సమస్యల ఫొటోలను మొబైల్ ఫోన్‌లో జాయింట్ కలెక్టర్‌కు చూపించి సమస్య తీవ్రతను విన్నవించారు. కార్యక్రమంలో ఆ పార్టీనాయకులు దాలినాయుడు, కోల కిరణ్, టి. గౌరీశంకరరావు, తదితరులు పాల్గొన్నారు.

### మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

సీతానగరం: మండలంలో మద్యం తాగి వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవని ఎస్సై ఎం.రాజేష్ హెచ్చరించారు. ఈ మేరకు మరిపివలస జెడ్పీ ఉన్నత పాఠశాల గుచ్చిమి బస్టాప్ వద్ద సోమవారం వాహనాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ద్విచక్ర వాహన చోదకులు మద్యం తాగి వాహనం నడపడం వల్ల ఎక్కువమంది రోడ్డు ప్రమాదాలకు గురవుతున్నారని పోలీస్ శాఖ గుర్తించినట్లు తెలియజేశారు. రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎస్పీ మాధవ రెడ్డి ఆదేశాలమేరకు వాహనాలను తనిఖీ చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో వాహన చోదకులు, ఆటో డ్రైవర్లు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# కరెంట్ కట్‌కటలు





చిలకలపల్లి సబ్‌స్టేషన్

బలిజిపేట:

అప్రకటిత విద్యుత్ కోతలతో బలిజిపేట మండల ప్రజల అవస్థలు వర్ణనాతీతంగా ఉన్నాయి. నిరంతర విద్యుత్ సరఫరా లేకపోగా తీవ్రంగా విద్యుత్ సరఫరాలో అంతరాయంతో ప్రజలు విసుగుచెందుతున్నారు. ఒకవైపు ఎండలు మండిపోతూ ఉక్కపోత తీవ్రంగా ఉంటుంటే అనధికారిక విద్యుత్ కోతలు మరింత విసిగిస్తున్నాయి. రోజులో 24గంటల కాలంలో ఎప్పుడు విద్యుత్ ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియని దుస్థితి నెలకొందని వినియోగదారులు తీవ్ర అసంతృప్తి చెందుతున్నారు. చిరుగాలి వీచినా, చిన్నచిన్న చినుకులు పడినా, ఈదురుగాలులు వీచినా, వర్షపు మేఘాలు కమ్మినా, వర్షపు ఛాయలు కమ్ముకున్నా ముందుగా విద్యుత్ కట్ అవుతుండడంతో అసంతృప్తి చెందుతున్నారు. పోయిన విద్యుత్ తిరిగి ఎప్పుడు వస్తుందో తెలియక అవస్థలు పడుతున్నారు. విద్యుత్ అంతరాయంతో తాగునీరు, సాగునీరు సరఫరాకు అంతరాయం కలుగుతుండడం, చిరు వ్యాపారాలు సాగకపోవడం, నివాసగృహాలలో ఎటువంటి పనులు సాగక ప్రజలకు అవస్థలు తప్పడం లేదు. ఒకవేళ అన్నీ బాగుంటే విద్యుత్‌శాఖ లైన్ మెయింటనెన్స్ అంటూ ఉదయం నుంచి సాయంత్రం వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగిస్తోంది. సాయంత్రం సమయంలో వారు విద్యుత్ సరఫరాను పునరుద్ధరించే సమయానికి వర్షపు మేఘాలు కమ్మితే మళ్లీ విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతోంది. రోజు మొత్తం మీద అతికొద్ది గంటలు మాత్రమే విద్యుత్ సరఫరా ఉంటోందని వినియోగదారులు చెబుతున్నారు. అధికారికంగా విద్యుత్ కోతలు లేనప్పటికీ అనధికారిక విద్యుత్ కోతలతో అన్ని వర్గాల ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. విద్యుత్ శాఖ సిబ్బంది ఎక్కువగా ఉన్నప్పటికీ విద్యుత్ అంతరాయాలు గంటలసేపు కలగడం దారుణంగా ఉందంటూ విసుగుచెందుతున్నారు. కొన్ని సందర్భాల్లో లో వోల్టేజ్ సమస్యతో సతమతమవుతున్నామని అసహనం వ్యక్తం చేస్తున్నారు. బలిజిపేట మండలంలో ఉన్న 20,351సర్వీసులకు సంబంధించిన ప్రజలు అనధికారిక విద్యుత్ కోతలతో తీవ్ర అవస్థలకు గురవుతున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడంపై తీవ్రస్థాయిలు విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అనధికారిక విద్యుత్ కోతలతో వృద్ధులు, చిన్నారులు, గర్భిణులు, బాలింతలు నివాసగృహాల్లో ఉండలేక ఉక్కపోతతో అల్లాడుతున్నారని మహిళలు తెలుపుతున్నారు.

#### మండలంలో విద్యుత్ కనెక్షన్లు

గృహ విద్యుత్ వినియోగదారుల సర్వీసులు (కేటగిరి-1) - **19,436**
చిరువ్యాపార సర్వీసులు(కేటగిరి-2)- **1,383**
ఇండస్ట్రియల్ సర్వీసులు(కేటగిరి-3) - **114**
ప్రభుత్వ కార్యాలయాలు, పాఠశాలలు, కళాశాలలు, ఆలయాలు, చర్చిలు తదితరమైనవి(కేటగిరి-4)సర్వీసులు - **456**
వ్యవసాయ పంపుసెట్లు(కేటగిరి-5) సర్వీసులు - **1,506**
వీటిలో బిల్‌స్టాప్ సర్వీసులు **2,544** ఉన్నాయి.
ఇవిపోను వినియోగంలో అన్ని రకాల సర్వీసులు **20,351** ఉన్నాయి.

#### ఎప్పుడు ఉంటుందో.. ఎప్పుడు ఉండదో..

విద్యుత్ సరఫరా ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు ఉండదో తెలియడం లేదు. అవసరానికి ఉండడం లేదు. ఇంట్లో శుభకార్యాలు చేసుకునే సమయంలో, అత్యవసర సమయాలలో విద్యుత్ అంతరాయం తీవ్రంగా ఉంటోంది.
– సత్యంనాయుడు, బలిజిపేట

# ఆటో డ్రైవర్లను నిర్లక్ష్యం చేస్తే పోరాటం



రెవెన్యూ అధికారులకు వినతిపత్రాన్ని అందిస్తున్న నాయకులు, డ్రైవర్లు

సాలూరు: ఆటో డ్రైవర్లను నిర్లక్ష్యం చేస్తే పోరాటం తప్పదని ఆటోక్యాబ్ డ్రైవర్ల సంక్షేమ సంఘం గౌరవ అధ్యక్షుడు, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎన్ వైనాయుడు ప్రభుత్వానికి స్పష్టం చేశారు. ఈ మేరకు సాలూరులో ఆటో క్యాబ్‌డ్రైవర్ల సంతకాల సేకరణ వివరాలను తహసీల్దార్ ఆఫీసులో అధికారులకు సోమవారం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు పథకం ఇవ్వనున్న నేపథ్యంలో ఆటో డ్రైవర్లందరూ తీవ్రంగా నష్టపోతారన్నారు. కావున వారికి వాహనమిత్ర పథకం అమలుచేసి రూ.25 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఆటో డ్రైవర్లకు ఉపాధిలేకుండా చేస్తే, వారంతా రోడ్డున పడతారని, దీనికి రాష్ట్ర ప్రభుత్వమే బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు, తదితరులు పాల్గొన్నారు.

# సాలూరులో హర్‌ఘర్‌తిరంగా ర్యాలీ



పట్టణంలో నిర్వహిస్తున్న హర్‌ఘర్ తిరంగా ర్యాలీ

సాలూరు: మున్సిపల్ కమిషనర్ రత్నాకర్ ఆధ్వర్యంలో సోమవారం హర్‌ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. మున్సిపల్ కార్యాలయం నుంచి మెయిన్‌రోడ్డు సెంటర్ వరకు ర్యాలీ చేసి, మానవహారంగా రూపొందారు. కార్యక్రమంలో అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

**మక్కువలో..**

మక్కువ: స్థానిక ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులు సోమవారం హర్ ఘర్ తిరంగా ర్యాలీ నిర్వహించారు. కళాశాల ప్రిన్సిపాల్ మంజులావీణ జెండా ఊపి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఎన్ఎస్ఎస్ పీవో ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో విద్యార్థులు మక్కువలోని పలు వీధుల్లో జాతీయ జెండాలు చేతపట్టుకుని, హర్ ఘర్ తిరంగా నినాదాలతో ర్యాలీ నిర్వహించారు. ఆగస్టు 15వతేదీన స్వాతంత్య్ర దినోత్సవాన్ని ప్రజలంతా ఘనంగా జరుపుకోవాలని కోరారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం పాల్గొన్నారు.



హర్ ఘర్ తిరంగా ర్యాలీని ప్రారంభిస్తున్న ప్రిన్సిపాల్ మంజులావీణ

# అడుగుకో గుంతతో అవస్థలు



కన్నంపేట, వెంకంపేట గ్రామాల మధ్య మరమ్మతుల బారిన పడిన రహదారి

మక్కువ: మండలకేంద్రం మక్కువ నుంచి బొబ్బిలి పట్టణానికి వెళ్లే రహదారిలో అడుగుకో గుంత ఏర్పడంతో, ప్రయాణికులు అనేక అవస్థలు పడుతున్నారు. మక్కువ నుంచి మేళాపువలస, ఎ.వెంకంపేట, కన్నంపేట గ్రామాల మీదుగా నిత్యం ఉద్యోగులు, విద్యార్థులు, సామాన్యప్రజలు రాకపోకలు సాగించాల్సి ఉంది. మక్కువ నుంచి సుమారు 5కిలోమీటర్ల మేరకు రహదారి మొత్తం పాడవడంతో వాహన చోదకులు ఇబ్బందులు పడుతున్నారు. బొబ్బిలి పట్టణం నుంచి నారసింహునిపేట గ్రామం వరకు, రహదారికి మరమ్మతులు జరిపించి, నారసింహునిపేట గ్రామం నుంచి మక్కువ వరకు, ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మతులు జరిపించలేదు. ఇప్పటికైనా గిరిజనశాఖమంత్రి సంధ్యారాణి స్పందించి మక్కువ, బొబ్బిలి గ్రామాల మధ్య రహదారికి మరమ్మతులు జరిపించేలా చర్యలు చేపట్టాలని వాహనదారులు కోరుతున్నారు.

### వీఆర్‌ఓపై చర్యలు తీసుకోవాలి



తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలుపుతున్న దళిత రైతులు

సాలూరు రూరల్: మండలంలోని నెలిపర్తి గ్రామంలో దళితులు సాగుచేస్తున్న భూములపై తప్పుడు నివేదిక ఇచ్చిన వీఆర్‌ఒ వంశీకృష్ణపై శాఖా పరమైన చర్యలు తీసుకోవాలని కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ఆధ్వర్యంలో సోమవారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా గ్రామానికి చెందిన దళిత రైతులు గొండేల కృష్ణ, గొండేల మురళి ఆధ్వర్యంలో తహసీల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ తాత, తండ్రుల దగ్గరనుంచి వారత్వంగా వచ్చిన భూమిని సాగు చేస్తున్నామని వాటికి పట్టాలు ఇవ్వాల్సిందిపోయి పెత్తందారులకు భూములు కట్టపెట్టాలని చూస్తున్నారని ఆరోపించారు. కార్యక్రమంలో పలువురు దళిత రైతులు పాల్గొన్నారు.

# గత ప్రభుత్వంలోనే పాఠశాలల అభివృద్ధి



కోదు కరక వలస గ్రామంలో గత ప్రభుత్వానికి ముందు పాఠశాల దుస్థితి



నాడు నేడు తరువాత పాఠశాల పరిస్థితి

- కూటమి పాలనలో చేసింది సున్నా

సాలూరు రూరల్: మండలంలో గత జగనన్న ప్రభుత్వంలోనే పాఠశాలలు ఎంతో అభివృద్ధి చెందాయనడం ఎంత నిజమో కూటమి ప్రభుత్వ ఏడాది పాలనలో పాఠశాలలు అంతే నిర్లక్ష్యానికి గురవుతున్నాయనడానికి ప్రస్తుతం మండలంలోని పాఠశాలల దుస్థితే ఉదాహరణగా చెప్పవచ్చు. ఇటీవల తోణాం పంచాయతీ మెట్టవలస గ్రామంలో గ్రామస్తులు డబ్బులు ఎత్తుకుని పాఠశాల నిర్మాణం చేసుకున్న విషయం తెలిసిందే. అలాగే గంగన్నదొరవలస గ్రామ ప్రాథమిక పాఠశాల విద్యార్థులు మంత్రి సంధ్యారాణికి పరాయి పంచల్లో చదువులు వెలగబెడుతున్నామని పాఠశాల భవన నిర్మాణం చేయాలని వేడుకున్న విషయం తెలిసిందే. అయితే గత ప్రభుత్వంలో అమలు చేసిన నాడు నేడు కార్యక్రమంలో చాలావరకు పాఠశాలలు అభివృద్ధి చెందాయి. నాడు నేడులో నిలిచిపోయిన భవన నిర్మాణ పనులు ఇంతవరకు ప్రారంభించకపోవడం కూటమి ప్రభుత్వం పాఠశాలల విషయంలో ఎంత నిర్లక్ష్యంగా ఉందో అర్థమవుతోందని పలువురు ఆరోపిస్తున్నారు. గదబ కరకవలస పాఠశాల భవనం పాడుబడి ఉండేది. గత ప్రభుత్వంలో నాడు నేడు కార్యక్రమంలో పాఠశాల భవనానికి మరమ్మతులు చేయడంతోపాటు పిల్లలు కూర్చునేందుకు బెంచీలు ఏర్పాటు చేశారు. అలాగే కోదుకరకవలస గ్రామంలో ప్రాథమిక పాఠశాల కూడా గత ప్రభుత్వంలోనే అభివృద్ధి జరిగింది.



గదబకరకవలస పాఠశాలకు నాడు నేడులో సదుపాయాల కల్పన



గదబ కరకవలస పాఠశాల గత ప్రభుత్వానికి ముందు పరిస్థితి

# మంచి సేవలకు గుర్తింపు



బదిలీపై వెళ్లిపోయిన సచివాలయ సిబ్బందిని సన్మానించిన సర్పంచ్ రాఘులత

బలిజిపేట: స్థానిక సచివాలయంలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిపోయిన సిబ్బందిని సర్పంచ్ రాఘులత ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ ఉద్యోగ విధి నిర్వహణలో ఉండి ఎక్కడైనా మంచి సేవలు అందించేవారికి మంచి గుర్తింపు ఉంటుందన్నారు. బలిజిపేట సచివాలయంలో బదిలీ అయినంతవరకు పనిచేసి గ్రామస్తులకు అవసరమైన సేవలు అందించడంలో, పంచాయతీ పరంగా ఎటువంటి సమస్యలు తలెత్తకుండా సక్రమంగా విధులు నిర్వహించి పంచాయతీకి మంచి పేరు ప్రతిష్ఠలు తీసుకువచ్చినందుకు సిబ్బందికి ధన్యవాదాలు తెలిపారు. గ్రామకార్యదర్శితో పాటు బదిలీపై వెళ్లిపోయిన వారిని ఘనంగా సన్మానించి వారికి బహుమతులు అందించారు. కార్యక్రమంలో మండల ఉపాధ్యక్షుడు వి.సాయిరాం, సత్యనారాయణమూర్తి, కుమార్ మాస్టారు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# విద్యార్థులకు అసెస్మెంట్ బుక్‌లెట్స్ పంపిణీ

సీతానగరం: మండలంలోని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల విద్యార్థులకు యు డైస్ ప్రాప్తికి అసెస్మెంట్ బుక్‌లెట్స్ సోమవారం పంపిణీ చేసినట్లు ఎంఈఓ జి.సూరిదేముడు తెలియజేశారు. ఈ మేరకు మండలకేంద్రంలోని ప్రాథమిక పాఠశాల హెచ్‌ఎం ఆధ్వర్యంలో సోమవారం బుక్‌లెట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంఈఓ -2 వెంకటరమణ హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

# నిర్దిష్టమైన వేగంతో వెళ్లాలి



వాహన తనిఖీలు చేస్తున్న రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి

పార్వతీపురం రూరల్: వాహన చోదకులు నిర్దిష్టమైన వేగంతో వెళ్లాలని ప్రధానంగా రహదారిపై మలుపుల వద్ద, పలు జంక్షన్ల వద్ద, గ్రామాల ప్రారంభాల్లో నిర్దిష్టమైన వేగంతో వెళ్లి ప్రమాదాలకు తావులేకుండా సురక్షితంగా గమ్యాలకు చేరుకోవాలని పార్వతీపురం రూరల్ ఎస్సై బి.సంతోషికుమారి అన్నారు. మితిమీరిన వేగాన్ని అదుపు చేయలేని పరిస్థితుల్లో రోడ్డు ప్రమాదాలు జరిగేందుకు ఆస్కారం ఉంటుందని వాహన దారులకు తెలిపారు. ఈ మేరకు సోమవారం సాయంత్రం మండల పరిధిలో పలు ప్రధాన కూడళ్లలో వాహన తనిఖీలు చేపట్టారు. కార్యక్రమంలో ఆమెతోపాటు శిక్షణ నిమిత్తం వచ్చిన ఎస్సైలు, రూరల్ సిబ్బంది ఉన్నారు.

# అర్జీదారు సంతృప్తి చెందాలి

- కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్
- సమస్యల పరిష్కారానికి 96 అర్జీలు



ప్రజల నుంచి సమస్యలపై అర్జీలను స్వీకరిస్తున్న కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: పీజీఆర్‌ఎస్‌కు సమస్యల పరిష్కారం కోసం 96 అర్జీలు సోమవారం కలెక్టరేట్‌కు వచ్చినట్లు కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ చెప్పారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ ఎస్ఎస్ శోభిక, వీఆర్‌ఓ హేమలత, డీఆర్‌డీఏ పీడీ సుధారాణిలతో కలిసి అర్జీలు స్వీకరించినట్లు కలెక్టర్ తెలిపారు. సమస్యల పరిష్కారంలో అర్జీదారు అసంతృప్తి చెందకూడదని అధికారులకు స్పష్టం చేశారు. వచ్చిన అర్జీలలో ప్రధానంగా పార్వతీపురం మండలంలోని తాగునీటి సమస్యపై, అలాగే గ్రామంలోని అనారోగ్య పరిస్థితులపై విన్నవించగా సంగంవలస పరిధిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించాలని కొంతమంది దరఖాస్తు చేశారు. అలాగే పాచిపెంట మండలం తాడూరు, శీల గ్రామానికి చెందిన 31 మంది రైతులకు పట్టాలు మంజూరు చేయాలని వినతిపత్రం సమర్పించారు. అన్నదాత సుఖీభవ, దివ్యాంగుల సమస్యలు, తల్లికి వందనం తదితర సమస్యలపై జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజలు తమ సమస్యలను అర్జీల ద్వారా విన్నవించారు. అలాగే అర్జీదారులకు దాతల సాయంతో కలెక్టరేట్ ప్రాంగణంలో ఉచితంగా భోజన సదుపాయం ఏర్పాటు చేశామని ప్రతి అర్జీదారు భోజనం చేసి వెళ్లాని కలెక్టర్ సూచించారు. ఈ కార్యక్రమంలో దాతలు భాగస్వామ్యం అయ్యేందుకు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో జిల్లా స్థాయి అధికారులు తదితర సిబ్బంది ఉన్నారు.

**చట్టపరిధిలో ఫిర్యాదుల పరిష్కారం**



సమస్యల పరిష్కారానికి ఫోన్‌లో ఆదేశాలు జారీ చేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి

పార్వతీపురం రూరల్: నిర్దేశించిన సమయంలోనే ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ఫిర్యాదులను చట్ట పరిధిలో పరిష్కరించాలని ఎస్పీ ఎస్‌వీ మాధవ్ రెడ్డి సంబంధిత పోలీసు శాఖాధికారులకు స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం జిల్లా పోలీస్ కార్యాలయంలో ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమాన్ని ఆయన నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లాలో ఉన్న పలు స్టేషన్ల పరిధిల నుంచి వచ్చిన ఫిర్యాదుదారుల అర్జీలను స్వీకరించి, అర్జీదారులతో ఎస్పీ ముఖాముఖి మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. వారి ఫిర్యాదులను క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా వచ్చిన ఫిర్యాదుల్లో సమస్యలపై సంబంధిత పోలీసు అధికారులతో స్వయంగా ఎస్పీ ఫోన్లో మాట్లాడి ఫిర్యాదు అంశాలను పరిశీలించి, వాటి పూర్వాపరాలను విచారణ చేసి, ఫిర్యాదు అంశాలు వాస్తవాలైనట్లయితే చట్ట పరిధిలో తక్షణ చర్యలు చేపట్టాలని, తీసుకున్న చర్యలకు సంబంధించిన నివేదికను జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయానికి పంపాలని ఆదేశించారు. కార్యక్రమంలో మొత్తం 5 ఫిర్యాదులు అందాయి. డీసీఆర్బీ సీఐ సుధాకర్, ఎస్ఐ ఫక్రుద్దీన్ తదితర సిబ్బంది కార్యక్రమంలో పాల్గొన్నారు.

**ఐటీడీఏ పీజీఆర్‌ఎస్‌కు 39 వినతులు**



సీతంపేట: అర్జీలు స్వీకరిస్తున్న ఏపీఓ చిన్నబాబు

సీతంపేట: స్థానిక ఐటీడీఏలో సోమవారం నిర్వహించిన పీజీఆర్‌ఎస్ (ప్రజాసమస్యల పరిష్కార వేదిక)కు 39 వినతులు వచ్చాయి. ఐటీడీఏ ఏపీఓ జి.చిన్నబాబు అర్జీలు స్వీకరించారు. భామిని మండలం యాతంగూడకు చెందిన గ్రామస్తులు గ్రామంలో సామాజిక భవనం నిర్మించాలని అర్జీ ఇచ్చారు. కోసింగూడ గ్రామస్తురాలు ఆరిక విజయ కుట్టుమిషన్ ఇప్పించాలని కోరింది. సవరపోలూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ గ్రామానికి విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మంజూరు చేయాలని వినతిపత్రం అందజేశాడు. భాషావలంటీర్ పోస్టు ఇప్పించాలని జన్నిగూడకు చెందిన బెన ర్జీరావు, తల్లికి వందనం పథకం మంజూరు కాలేదని అందజేయాలని మాలిపేటకు చెందిన మహాలక్ష్మి కోరారు. ఆటోలోన్ ఇప్పించాలని నాగులు గూడ గ్రామస్తుడు నిమ్మక సింహాచలం విన్నవించాడు. కార్యక్రమంలో ట్రైబల్ వెల్ఫేర్ డీడీ అన్నదొర, డిప్యూటీఈవో రామ్మోహన్‌రావు, స్పోర్ట్స్ ఇన్‌చార్జ్ జాకాబ్ దయానందం, వ్యవసాయాధికారి వాహిని, సీడీపీఓ సిమ్మాలమ్మ, ఏఎంవో కోటిబాబు, హెచ్‌వో జయశ్రీ తదితరులు పాల్గొన్నారు.